సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం । 30 । మే । 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో సోమవారానికి 41.908 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 160 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,980
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,566
3 శాతం జీఎస్టీతో	రూ.5,733
నవర (8 గ్రా)	రూ.45,864

వాతావరణం

గరిష్టం/కనిష్టం 40.1 /30.4

జిల్లా వ్యాప్తంగా సోమవారం ఉష్ణోగ్రతలు పెరిగాయి. గాలిలో 56 శాతం తేమ ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు.

సంక్షేమం.. అభివృద్ధి దారుల్లో..



- సచివాలయాలు, ఆర్బీకేలతో ప్రజల ముంగిటకే సేవలు
- నాడు-నేడుతో కొత్తగా ప్రభుత్వ స్కూళ్లు
- సాగునీటి ప్రాజెక్ట్‌లకు ఊపిరి
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి నేటితో నాలుగేళ్లు పూర్తి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నాలుగు సంవత్సరాలు.. ఈ కాలంలో సంక్షేమ పథకాలు సామాన్యుల జీవితాల్లో వెలుగులు నింపాయి. అభివృద్ధికి కొత్త అర్థం వచ్చింది. గత ప్రభుత్వం మాటలకే పరిమితమైంది. ప్రజలను ఏమాత్రం పట్టించుకోలేదు. ఇంటి స్థలం ఇచ్చిన పాపాన పోలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జిల్లాలో సుమారు 55 వేల మంది మహిళల పేరు మీద ఇంటి పట్టాలు ఇచ్చింది. అంతేకాకుండా గృహాలు కట్టిస్తున్నారు. పాలనలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, వైఎస్సార్ ఆసరా, చేయూత, జగనన్న తోడు, మత్స్యకార భరోసా, నేతన్న నేస్తం, రైతు భరోసా వంటి సంక్షేమ పథకాలు అన్ని వర్గాలకు అండగా నిలిచాయి. సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌లు, నాడు - నేడు ద్వారా ఉప ఆరోగ్య కేంద్రాలు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్ల ఆధునికీకరణ.. కొత్త భవనాల నిర్మాణాలతో అభివృద్ధికి కొత్త భాష్యం చెప్పారు. జిల్లాలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న నెల్లూరు, సంగం బ్యారేజీలను పూర్తి చేశారు.

సోమశిలకు భారీగా నిధులు

సోమశిల జలాశయానికి ప్రభుత్వం రూ.కోట్లు మంజూరు చేసింది. 103 కిలోమీటర్ల పొడవు కలిగిన ఉత్తర కాలువ పూర్తి సామర్థ్యం 350 క్యూసెక్కులు. దీనిని 700 క్యూసెక్కులకు రెట్టింపు చేసేందుకు కాలువ వెడల్పు పనులు ఇప్పటికే రూ.200 కోట్లతో పూర్తి చేశారు. దీంతోపాటు సోమశిల, కండలేరు వరద కాలువ సామర్థ్యం పెంపునకు సంబంధించి రూ.180 కోట్ల మేర పనులు పూర్తయ్యాయి. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సంకల్పానికి బాటలు వేస్తూ సోమశిల హైలెవల్ కాలువ రెండోదశ పనులు రూ.125 కోట్ల మేర పనులు పూర్తి చేశారు. సోమశిల జలాశయం నుంచి భారీగా వరద జలాలు విడుదలైన నేపథ్యంలో అప్రాన్ ప్రాంతం దెబ్బతింది. వెంటనే పనులను మంజూరు చేసి ప్రారంభించారు. ప్రస్తుతం రూ.30 కోట్ల మేర పనులు జరిగాయి.

ఎన్నో కార్యక్రమాలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో వైద్యానికి ఊపిరి పోసింది. గ్రామీణ స్థాయిలో హెల్త్ క్లినిక్స్ నుంచి ఆరోగ్య ఉపకేంద్రాలు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలతోపాటు ఏరియా వైద్యశాలలు, జిల్లా వైద్యశాలలు, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, వైద్య కళాశాల వరకు రూ.వందల కోట్లు వెచ్చించి సకల సౌకర్యాలు కల్పించింది. 108, 104 కొత్త వాహనాలు వచ్చాయి.

- ప్రభుత్వ బడులు రూపురేఖలు మారిపోయాయి. తొలివిడతలో 1,059 స్కూళ్లను రూ.200 కోట్లకు పైగా వెచ్చించి బాగు చేశారు. రెండో విడతలోనూ వెయ్యికి పైగా స్కూళ్లలో పనులు జరుగుతున్నాయి. దీంతో ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతోంది.
- జిల్లాలో వార్డు, గ్రామ సచివాలయాలు 500 పైనే ఉన్నాయి. వీటి ద్వారా ప్రజలకు త్వరగా ప్రభుత్వ సేవలు అందుతున్నాయి.

ఇటీవల

- జిల్లాలో జగనన్న విద్యా దీవెన పథకానికి సంబంధించి 37,485 మంది విద్యార్థుల కోసం రూ.34.36 కోట్లు విడుదల చేశారు.
- మత్స్యకార భరోసా పథకంలో భాగంగా 12,072 మంది కోసం రూ.12.7 కోట్లు అందించారు.

రిజిస్ట్రేషన్లకు అంతరాయం



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఇదీ పరిస్థితి

నెల్లూరు సిటీ: సాంకేతిక సమస్య కారణంగా జిల్లాలోని వివిధ మండలాల్లో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోమవారం రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు అంతరాయం ఏర్పడింది. జిల్లాలో 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వాటిల్లో రిజిస్ట్రేషన్లు, పలు సేవల నిమిత్తం వందల సంఖ్యలో ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఉదయం నుంచి సాయంత్రం వరకు సాంకేతిక సమస్య తలెత్తడంతో కార్యకలాపాలు నిలిచిపోయినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు.

శరవేగంగా రామాయపట్నం పోర్టు నిర్మాణం



పునరావాసం, ఉద్యోగ అవకాశాలపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రులు

- చంద్రబాబును ప్రజల నమ్మరు
- రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్

గుడ్లూరు: 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలోనే 4 పోర్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టి నవశకానికి నాంది పలికారు. రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.' అని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ తెలిపారు. మండలంలోని మొండివారిపాళెం వద్ద జరుగుతున్న రామాయపట్నం పోర్టు పనులను ఆయన సోమవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం పోర్టు కార్యాలయంలో ఉపాధి, ఉద్యోగావకాశాలు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, పునరావాస సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. తర్వాత దక్షిణం వైపు జరుగుతున్న బ్యాక్ వాటర్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అమర్నాథ్ మాట్లాడుతూ రామాయపట్నం పోర్టుకు సంబంధించి దక్షిణం వైపు బ్యాక్ వాటర్ పనులు 3,700 మీటర్లకు గానూ 2,700 మీటర్లు పూర్తి కాగా.. ఉత్తరం వైపు బ్యాక్ వాటర్ పనులు 1,370 మీటర్లు పూర్తయ్యాయని చెప్పారు. రామాయపట్నం పోర్టు మొదలైతే ఈ ప్రాంతం ముఖచిత్రమే మారిపోతుందని, ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాలు అభివృద్ధిపథంలో పయనిస్తాయన్నారు.

బాబును నమ్మే పరిస్థితి లేదు

కర్ణాటక, గోవా మేనిఫెస్టోలను కాపీ కొట్టిన చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదని మంత్రి అమర్నాథ్ విమర్శించారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలే మరోసారి వైఎస్సార్ సీపీకి విజయాన్ని చేకూరుస్తాయన్నారు. గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు జిల్లా అభివృద్ధిలో దివంగత సీఎం వైఎస్సార్, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెరగని ముద్ర వేశారన్నారు. కృష్ణపట్నం పోర్టు, అనుబంధ పరిశ్రమలు, సంగం, పెన్నా బ్యారేజీలు, జెన్‌కో, థర్మల్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటు.. ఇంకా అనేక అభివృద్ధి పనులు జిల్లాలో పూర్తి చేసిన ఘనత వారికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జేసీ కూర్మనాథ్, కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, రామాయపట్నం పోర్టు ఎండీ ప్రతాప్‌రెడ్డి, ఏపీ మారిటైం బోర్డు చీఫ్ ఇంజినీర్ రాజగోపాల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, గుడ్లూరు, ఉలవపాడు మండలాల తహసీల్దార్లు సూర్యనారాయణ సింగ్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

1న రైతు భరోసా నగదు జమ

నెల్లూరు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకానికి సంబంధించిన నగదును జూన్ 1వ తేదీన రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్‌రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2,14,636 మంది రైతుల ఖాతాల్లో రూ.118 కోట్ల నగదు ప్రభుత్వం జమ చేస్తుందని తెలియజేశారు. అలాగే ఈ ఏడాది మార్చి, ఏప్రిల్, మే నెలల్లో కురిసిన అకాల వర్షాలతో జరిగిన పంట నష్టానికి సంబంధించి 1,456 మంది రైతులకు రూ.1.68 కోట్ల నగదు వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 30వ తేదీన రైతుభరోసా నగదు జమ చేయాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల జూన్ 1వ తేదీకి మార్పు చేసినట్లు వెల్లడించారు.

నాడు - నేడుపై ప్రత్యేక దృష్టి

నెల్లూరు(దర్గామిట్ట): పాఠశాలల్లో నాడు - నేడు పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి త్వరితగతిన పూర్తి చేయించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ వీసీ హాల్ నుంచి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ వెల్ఫేర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సోమవారం సాయంత్రం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మరుగుదొడ్లు, వంటగది నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. జగనన్న విద్యా కానుక విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముందుగానే మండల స్థాయి స్టాక్ పాయింట్లలో అన్ని వస్తువుల నాణ్యతను పరిశీలించి, సీఆర్పీ, ఏపీఎంల సహకారంతో కిట్లను సిద్ధం చేయాలన్నారు. పాఠశాలలు పునః ప్రారంభమయ్యే నాటికి ప్రతి విద్యార్థికి విద్యా కానుక కిట్లను అందించాలని ఆదేశించారు. తొలుత డీఈఓ గంగాభవాని నాడు-నేడు పనుల పురోగతి, విద్యా కానుక తదితర వాటిపై వివరించారు. కాన్ఫరెన్స్‌లో జేసీ కూర్మనాథ్, డీపీఓ సుస్మిత, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఎస్‌ఈలు, రంగవరప్రసాద్, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైల బదిలీలు

నెల్లూరు(క్రైమ్): జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న తొమ్మిది మంది ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. షేక్ సుభానీ సీసీఎస్ నుంచి నెల్లూరు రూరల్‌కు, సీహెచ్ కోటిరెడ్డి నెల్లూరు రూరల్ నుంచి వింజమూరుకు, వై.రంగనాథ్‌గౌడ్ వింజమూరు నుంచి రాపూరుకు, ఎస్.క్రాంతికుమార్ రాపూరు నుంచి డీసీఆర్‌బీకి, ఎ.బాజిరెడ్డి దుత్తలూరు నుంచి ఉలవపాడుకు, టి.త్యాగరాజు ఉలవపాడు నుంచి నెల్లూరు వీఆర్‌కు, ఎస్.ప్రభాకర్ ఉదయగిరి నుంచి దుత్తలూరుకు, కె.ఇంద్రసేనారెడ్డి టీపీగూడూరు నుంచి ఉదయగిరికి, జె.కుమార్ సౌత్ ట్రాఫిక్ నుంచి టీపీగూడూరుకు బదిలీ అయ్యారు. వీరంతా వెంటనే విధుల్లో చేరాలని ఎస్పీ ఆదేశించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 158
లేయర్ (లైవ్)	: 98
బ్రాయిలర్ చికెన్	: 270
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 300
లేయర్ చికెన్	: 167

ఏసీబీకి చిక్కిన పీఆర్ జూనియర్ అసిస్టెంట్

- కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం
- 10 నెలల క్రితం ఉద్యోగంలో చేసిన మనోజ్‌కుమార్



ఏసీబీకి పట్టుబడిన జూనియర్ అసిస్టెంట్ మనోజ్‌కుమార్

కావలి: కావలిలోని పంచాయతీరాజ్‌శాఖ ఈఈ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న సీహెచ్ మనోజ్‌కుమార్ గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం భవనాలను నిర్మించిన కాంట్రాక్టర్ వద్ద రూ.27,000 లంచం తీసుకుంటూ సోమవారం అవినీతి నిరోధకశాఖ అధికారులకు చిక్కాడు. వివరాలు.. కందుకూరు నియోజకవర్గం గుడ్లూరులో గ్రామ సచివాలయంతోపాటు రైతుభరోసా కేంద్రం భవనాలను కాంట్రాక్టర్ రామాల మాధవరెడ్డి నిర్మించాడు. కావలిలోని పంచాయతీరాజ్ ఈఈ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ మనోజ్ కుమార్ బిల్లులకు పాస్ ఆర్డర్ వేస్తుంటాడు. ఆయన సదరు కాంట్రాక్టర్ వద్ద లంచం తీసుకుంటుండగా నెల్లూరు డీఎస్పీ జీఆర్ఆర్ మోహన్, సీఐలు రమేష్‌బాబు, కిరణ్, వేణు, జీఎల్ శ్రీనివాస్, సిబ్బంది కలిసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

10 నెలల క్రితం కారుణ్య నియామకం

తండ్రి చనిపోవడంతో ప్రభుత్వ కారుణ్య నియామకం ద్వారా 10 నెలల క్రితం కావలిలోని పంచాయతీరాజ్ ఈఈ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరిన సీహెచ్ మనోజ్‌కుమార్ సంబంధం లేని పనుల్లో వేలుపెట్టి ఏసీబీకి చిక్కాడు. కొత్తగా విధుల్లో చేరిన సీహెచ్ మనోజ్‌కుమార్ ప్రతి రోజూ నెల్లూరు నుంచి కావలికి వచ్చి విధులు నిర్వహించి సాయంత్రానికి తిరిగి వెళుతుంటాడు.

కాగా, ఈఈ కార్యాలయంలో కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులకు సంబంధించిన పాస్ ఆర్డర్ వేసేది ఈఈ కార్యాలయం సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించే మహిళా ఉద్యోగి. అయితే పాస్ ఆర్డర్ వేసే పనిని కొత్తగా ఉద్యోగంలో చేరిన మనోజ్‌కుమార్‌తో చేయిస్తుండడం గమనార్హం. ఈ క్రమంలో కందుకూరు నియోజకవర్గం గుడ్లూరులో గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం భవనాలను నిర్మించిన కాంట్రాక్టర్ నుంచి జూనియర్ అసిస్టెంట్ మనోజ్‌కుమార్ రూ.27,000 లంచం తీసుకుంటూ అవినీతి నిరోధకశాఖ అధికారులకు పట్టుబడ్డాడు.

అర్జీలు స్వీకరించి.. భరోసా కల్పించి..



దివ్యాంగుడి సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్

నెల్లూరు(దర్గామిట్ట): ప్రజల నుంచి ఉన్నతాధికారులు అర్జీలు స్వీకరించి వాటిని వెంటనే పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. నెల్లూరు కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో సోమవారం జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ఎం.హరినారాయణన్, ట్రైనీ కలెక్టర్ సంజన సింహ, డీఆర్వో వెంకటనారాయణమ్మ, జెడ్పీ సీఈఓ చిరంజీవి తదితరులు ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఇందుకోసం కింది స్థాయిలో అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీడీలు కె.సాంబశివారెడ్డి, సౌజన్య, డీపీఓ సుస్మిత, డీఈఓ గంగాభవాని పాల్గొన్నారు.

ఉద్యోగం కోసం..



సోషల్ వెల్ఫేర్‌లో నా భర్త నాగేంద్ర కామాటిగా అవుట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వర్తిస్తూ క్యాన్సర్‌తో మృతిచెందాడు. ఇద్దరు పిల్లలున్నారు. నాకు అవుట్ సోర్సింగ్‌లో ఉద్యోగం ఇప్పించి ఆదుకోండి.

– వంబ లక్ష్మిప్రసన్న, ముత్యాలపాళెం, నెల్లూరు

బదిలీ కోసం..

నా కుమార్తె హిమశ్రీ బోగోలులోని గురుకుల పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. ఆమెను పెద్ద పవని గురుకుల పాఠశాలకు బదిలీ చేయాలని విన్నవించా. కలెక్టర్ నా వద్దకు వచ్చి వివరాలు తెలుసుకుని తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

– వెంకటేశ్వర్లు, వలేటివారిపాళెం మండలం

ఇంటర్ పరీక్షల్లో ఒకరు డిబార్

నెల్లూరు(టౌన్): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా సోమవారం ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం పరీక్ష రాస్తున్న విద్యార్థి మాస్ కాపీయింగ్‌కు పాల్పడడంతో అధికారులు డిబార్ చేశారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సర పరీక్షలకు జనరల్‌కు సంబంధించి 9,144 మంది విద్యార్థులకు గాను 8,481 మంది హాజరయ్యారు. 663 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 279 మందికి గాను 250 మంది విద్యార్థులు హాజరయ్యారు. 29 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నుంచి జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షలకు జనరల్‌కు సంబంధించి 2,087 మంది విద్యార్థులకు గాను 1,891 మంది హాజరయ్యారు. 196 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 214 మందికి గాను 186 మంది హాజరయ్యారు. 28 మంది గైర్హాజరయ్యారు.

పాలనా వ్యవహారాలు మాతృభాషలోనే నిర్వహించాలి



మాట్లాడుతున్న సామల రమేష్‌బాబు

- తెలుగుభాషకు ప్రాధాన్యమివ్వాలి
- తెలుగు భాషోద్యమ సమాఖ్య గౌరవాధ్యక్షుడు సామల రమేష్‌బాబు

నెల్లూరు(బృందావనం): పాలనా వ్యవహారాలు మాతృభాషలోనే నిర్వహించాలని తెలుగు భాషోద్యమ సమాఖ్య గౌరవాధ్యక్షుడు సాముల రమేష్ బాబు అన్నారు. నెల్లూరులోని పురమందిరం ప్రాంగణంలో ఉన్న ఏసీ హాల్‌లో సోమవారం తెలుగుభాషోద్యమ సమాఖ్య జిల్లాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ప్రజాచైతన్యసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలుగుభాషను అధికారభాషగా, పాలనాభాషగా ప్రకటిస్తూ చట్టం వచ్చిందని, ఈ చట్టం వచ్చి ఐదున్నర దశాబ్దాల కాలంపైగా గడుస్తున్నప్పటికీ అమలుకు నోచుకోకపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. పార్లమెంట్‌లో సైతం తెలుగులో మాట్లాడే హక్కు ఉందని, కేంద్రంతో కూడా తెలుగుభాషలోనే ఉత్తర ప్రత్యుత్తరాలు చేయవచ్చని తెలిపారు. తెలుగు ప్రాంతీయభాష కాదని, జాతీయభాష అని తెలిపారు, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తెలుగులో పాలనా వ్యవహారాలు జరిగి మాతృభాషకు ప్రాధాన్యం ఇచ్చేలా ప్రభుత్వాలు వ్యవహరించాలని రమేష్ బాబు కోరారు. ఆ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి గుంటుపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు తెలుగుభాషలోనే కార్యక్రమాలు కొనసాగాలన్నారు. న్యాయస్థానాల్లో సైతం తీర్పులు తెలుగుభాషలోనే వెలువరించాలని కోరారు, ఏడాదిపాటు సమాఖ్య ఆధ్వర్యంలో మాతృభాష అన్ని రంగాల్లో అమలయ్యేలా అందరినీ సంఘటితం చేస్తూ కార్యక్రమాలు రూపొందించినట్లు తెలిపారు. సభకు తెలుగుభాషోద్యమ సమితి నేత చలంచర్ల భాస్కరరెడ్డి అధ్యక్షత వహించారు. సభలో పద్యకళా పరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.జయప్రకాష్, పి.అన్నపూర్ణ పాల్గొన్నారు.

అర్జీలను గడువు లోపు పరిష్కరించాలి



బాధితురాలి సమస్య వింటున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

- ఎస్పీ డాక్టర్ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): స్పందన అర్జీలను నిర్ణీత గడువు లోపు పరిష్కరించాలని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. వేసవి తీవ్రత దృష్ట్యా స్పందన కార్యక్రమాన్ని సోమవారం స్థానిక ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 90 మంది తమ సమస్యలను అర్జీల రూపంలో ఎస్పీకి అందజేశారు. ఓ దివ్యాంగురాలు నడవలేని స్థితిలో ఆటోలో ఉందన్న విషయాన్ని తెలుసుకున్న ఎస్పీ స్వయంగా ఆటో వద్దకు వెళ్లి ఆమె సమస్యను విన్నారు. సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆయా ప్రాంత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు, చిన్నారుల ఫిర్యాదులపై తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలిగించరాదని సూచించారు. కోర్టు ఉత్తర్వులతో ముడిపడి ఉన్న వివాదాల్లో న్యాయ నిపుణులతో చర్చించి సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. స్పందన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం అర్జీదారులకు భోజనం, మజ్జిగ అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీలు డి.హిమవతి, ప్రసాద్, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



కావలిరూరల్: కావలి – తెట్టు రైల్వేస్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం చోటుచేసుకుంది. రైల్వే ఎస్సై టి.అరుణకుమారి తెలిపిన వివరాల మేరకు కావలి – తెట్టు రైల్వేస్టేషన్ల మధ్య దిగువ లైన్‌లో పెంకుల ఫ్యాక్టరీ సంఘం వద్ద సోమవారం ఉదయం 8 గంటల సమయంలో సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగిన గుర్తుతెలియని పురుషుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతను నల్లని ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, పచ్చని లుంగీ ధరించి ఉన్నాడు. కుడి చేతికి ఎర్రని దారం కట్టుకుని ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అతని వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

తోటపల్లిగూడూరు : అనుమానాస్పద స్థితిలో ఓ యువతి మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. మండలంలోని సౌత్‌ఆములూరు గ్రామశివారులో చేపల గుంతల వద్ద ఓ మామిడి చెట్టుకు ఉరి వేసుకొని ఓ యువతి మృతి చెందినట్లుగా స్థానికులు సోమవారం గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం బాగా ఉబ్బిపోయి ఉండడంతో మూడు లేదా నాలుగు రోజుల క్రితం చనిపోయి ఉండొచ్చని, వయస్సు 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసుల అంచనా. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలి వివరాలు లభ్యం కాలేదని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

613 పొగాకు బేళ్ల కొనుగోలు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో గుండెమడగల క్లస్టర్‌కు చెందిన రైతుల నుంచి 613 పొగాకు బేళ్ల కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. రైతులు 637 బేళ్ల వేలానికి తీసుకురాగా 24 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. 75 వేల కిలోల పొగాకును రూ.1.49 కోట్లకు కొనుగోలు చేసినట్లు తెలిపారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.200, అత్యల్ప ధర రూ.186, సగటు ధర రూ.199.78గా నమోదైందని తెలిపారు.

నిరుద్యోగ మహిళలకు ఉపాధి అవకాశాలు

- 31న ఇంటర్వ్యూలు

నెల్లూరు(పొగతోట): జిల్లాలోని పరిశ్రమల్లో ఖాళీగా ఉన్న 50 పోస్టులను భర్తీ చేసేందుకు ఈ నెల 31వ తేదీన ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సి.విజయవినీల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి 18 నుంచి 30 సంవత్సరాల లోపు వయసు కలిగిన మహిళలు ఈ ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే మహిళలు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు జిరాక్స్, 2 పాస్‌పోర్ట్ ఫొటోలు తీసుకురావాలని తెలిపారు.

నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.50
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.15